క్లుప్తంగా

ఉపాధి పథకంలో సాగునీటి కాలువలు శుభ్రం



మునగపాకలో సాగునీటి కాలువలో ప్రవహిస్తున్న నీరు

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పలు సాగునీటి కాలువల రూపు రేఖలు మారుతున్నాయి. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని కాలువలు నేడు ఈ పథకం ద్వారా వినియోగంలోకి వస్తున్నాయి. గతంలో సాగునీరు ప్రవహించే పరిస్థితులు కనిపించేవి కావు. నేడు ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. తద్వారా ఎగువ నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీరు పుష్కలంగా పారుతుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

మునగపాక : ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటపుడు జాగ్రత్తలు పాటించాలని ఏఎస్ఐ మన్మథరావు కోరారు. శనివారం సాయంత్రం ఆయన మునగపాకలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసినా చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు రికార్డులు తన వెంట తెచ్చుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

స్పందించకపోతే ఉద్యమం తీవ్రతరం

కోటవురట్ల : అధికారులు స్పందించేంత వరకు దీక్ష ఆగదని, మరింత తీవ్రతరం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తెలిపారు. తమ గ్రామానికి రహదారి నిర్మించాలని, పాఠశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష 23వ రోజుకు చేరింది. వీరికి సంఘీభావంగా సీపీఎం నాయకులు దీక్షలో కూర్చుని నిరసన తెలిపారు. సీపీఎం నేత జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నక్కపల్లి : మండలంలో పలు ముస్లిం గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకొన్నారు. పెదదొడ్డిగల్లు, పాయకరావుపేట, బోదిగల్లం, రామకృష్ణపురం తదితర గ్రామాల్లో ముస్లిం గుమ్మటాలను వస్త్రాలతో అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. అంతకుముందు ఆయా గ్రామాల మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కనీస వేతనాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

అచ్యుతాపురం (అనకాపల్లి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్‌రావు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కైట్స్ కాలేజీలో శనివారం సీఐటీయూ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ, అంగన్‌వాడీ, వీఆర్‌ఏ, పంచాయతీరాజ్, మధ్యాహ్న భోజనం పథకం స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిల్లర వర్తకులు, పీఏసీఎస్, ఆటో, బిల్డింగ్, ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి సోమునాయుడు, జయ, మంగమ్మ, సత్యం, సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, సత్యవతి పాల్గొన్నారు.

30న మార్షల్ ఆర్ట్స్ పోటీలు

తుమ్మపాల: మండలంలోని మర్రిపాలెంలో ఈనెల 30న జిల్లా స్థాయి సైక్వో మార్షల్ ఆర్ట్స్ పోటీలను నిర్వహించనున్నట్టు సైక్వో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వనం సన్యాసిరావు, కార్యదర్శి యల్లబెల్లి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 ఏళ్ల లోపు జూనియర్స్, 18 ఏళ్ల పైబడిన సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తారని, ఆసక్తి గల కరాటే, తైక్వాండో క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 8179682841, 9573342621 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి వేడుకలు



ఆకట్టుకున్న కాయగూరలతో శ్రీనివాసుని అలంకరణ



చూచుకొండలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండల వ్యాప్తంగా శనివారం ఏకాదశి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఉదయం నుంచి భక్తులు తమ గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. చూచుకొండలోని కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. స్వామి విగ్రహాన్ని కాయగూరలతో అలంకరించి భక్తిని చాటుకున్నారు. స్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా భక్తి పారాయణం

పాయకరావుపేట : స్థానిక రాధా రుక్మిణీ గోదా సమేత పాండురంగ దేవస్థానంలో శనివారం వికాస తరంగణి వేంపాడు శాఖ సంకల్పించిన 108 ఏకాదశిలలో తిరువాయిమొ జి.అర్థ ఏకాహం నిర్వహించారు. తుని, పాయకరావుపేట వికాస తరంగణి శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో వెంకటాద్రి సహాయ సహకారాలతో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ యియ్యుణ్ణి నారాయణాచార్యులు, శ్రీమాన్ కృష్ణమాచార్యులు సంకల్పం చేయించి పారాయణ కార్యక్రమం ప్రారంభించి వైభవంగా జరిపారు. వికాస తరంగణి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పారాయణం చేస్తున్న మహిళలు

మణిపూర్ ఘటనకు నిరసనగా శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

పాయకరావుపేట : మణిపూర్‌లో జరుగుతున్న హింసకు నిరసనగా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. తుని, పాయకరావుపేట, తొండంగి, నక్కపల్లి, కోటనందూరు మండలాలకు చెందిన పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు, పాస్టర్లు పట్టణంలో బైపాస్ సెంటరు నుంచి గౌతమ్ థియేటర్ సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏపీపీఎస్సీ మెంబర్ సోనిహుడ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడైనా క్రైస్తవులు, క్రైస్తవ సంఘాలపై ఏవిధమైన దాడులు జరిగినా అందరం ఏకమై పోరాటం సాగించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సూరిబాబు, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పల్లా విలియం కేరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బోడపాటి శ్రీను, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు అయిజయ్య, బిషప్ దానియేలు, బిషప్ ఆశీర్వదం, ఎప్ ఏసురత్నం, చార్లస్ పిన్ని పాల్గొన్నారు.

'అసభ్య కరపత్రాలపై చర్య తీసుకోండి'

మునగపాక : చూచుకొండ గ్రామంలో మహిళపై అసభ్యకరంగా కరపత్రాలు గోడలకు అంటించడం చర్చనీయాంశమైంది. ఇటువంటి తప్పుడు ప్రచారానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళా పోలీసుకు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. చూచుకొండ గ్రామానికి చెందిన మహిళను లక్ష్యం చేసుకొని గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరమైన పదజాలంతో గ్రామంలోని కూడళ్లలో కరపత్రాలు అంటించారు. దీంతో బాధిత మహిళ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మునగపాక ఎస్ఐ అలీ దృష్టికి తీసుకువచ్చారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు వేచి ఉన్న భక్తులు

నక్కపల్లి : మండలంలో ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో శనివారం కిట కిటలాడింది. అధిక శ్రావణమాసంలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు కాకినాడ జిల్లా నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నెల నుంచి ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం విజయవంతమైంది. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు పర్యవేక్షణలో ప్రతి శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తున్నారు. సుమారు 400 మంది భక్తులకు పంపిణీ చేసినట్టు చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులకు ప్రతి శనివారం మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించడం సంతృప్తినిస్తోందన్నారు. అంతకుముందు కొండపై ఉన్న స్వామివారి నిజరూపానికి అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. కొండ దిగువన ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవ మూర్తులు పుష్పమాల, పట్టు పీతాంబరాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధూప, దీప నైవేద్యాలు, నీరాజన మంత్రపుష్పాలు, బాలభోగరాజ భోగ నివేదన చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల తాకిడితో ఆలయం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు పాల్గొన్నారు.

తంతడిలో లక్ష్మీ గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తంతడి గ్రామంలో శనివారం శుద్ధ ఏకాదశి(పద్మినీ ఏకాదశి)ని పురస్కరించుకొని సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆలయంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో భాగంగా పేదలకు బోడపల్లి దేముడు చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మాల కొండయ్య, కొల్లి అప్పారావు, వి.వి రమణ, గుడివాడ రమణ, నూకరాజు, భాస్కర్‌రావు, ధనరాజ్, చోడపల్లి సత్యం, అగ్గాల హనుమంతరావు, ద్వారపురెడ్డి బాబ్జి పాల్గొన్నారు.

లాజిస్టిక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

యలమంచిలి : ఆర్టీసీ కాంప్లెక్స్‌ల ద్వారా పార్సిల్ సర్వీస్‌లతో రవాణా వ్యవస్థను మరింత అభివృద్ధి చేయనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు అన్నారు. శనివారం యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ పార్సిల్ సరీసు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం కాంప్లెక్స్‌లో వసతులపై స్థానిక ప్రయాణికులతో అడిగి తెలుసుకున్నారు. బస్ కంట్రోల్ పాయింట్ వద్ద రికార్డులను తనిఖీ చేశారు. బస్సు వచ్చే సమయాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్సిల్ బుకింగ్ పాయింట్ల రికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలించి బుకింగ్‌లు పెంచే విధంగా కృషి చేయాలని ఏజెంటుకు సూచించారు. యలమంచిలి నుంచి విశాఖపట్నానికి ఇప్పటికే ఉన్న 500పై బస్సులతోపాటుగా రవాణా వ్యవస్థను మరింత అభివృద్ధి పరచడంతో పాటుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకుని మరో 4 బస్సులను యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌నకు విశాఖపట్నం నుంచి నడుపనున్నట్లు తెలిపారు. యలమంచిలి ప్రజలు లాజిస్టిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, కంట్రోలర్ అప్పారావు పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న అగ్రి గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: అగ్రి గోల్డ్ బాధితుల సమస్యను వెంటనే పరిష్కరించి వారిని ఆదుకోవాలని అగ్రి గోల్డ్ కస్టమర్స్,ఏజెంట్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం మాట్లాడుతూ ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న అగ్రి గోల్డ్ బాధితుల సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

ముగిసిన రివిట్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్



'డైట్'లో రివిట్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులతో అధ్యాపకులు

తుమ్మపాల: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు రివిట్ ఆర్కిటెక్చర్ కోర్సు అత్యున్నతమైనదని 'డైట్' ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. పట్టణంలో 'డైట్' ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 24 నుంచి నిర్వహిస్తున్న రివిట్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎన్.రాము మాట్లాడుతూ సివిల్ ఇంజినీర్లకు ఇండస్ట్రీలో మంచి అవకాశాలు ఉన్నాయని, భవిష్యత్తును మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని, ఈ వర్కుషాప్‌ల ద్వారా తక్కువ రోజుల్లోనే ఎక్కువ నేర్చుకోవచ్చని చెప్పారు. డీన్ డాక్టర్ కె.పార్వతి మాట్లాడుతూ రివిట్ ఆర్కిటెక్చర్‌తో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, బీఐఎం ఇంజినీర్లుగా దేశ విదేశాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలలో స్థిరపడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ ఐఈఐ కన్వీనర్ వై.హేమంత్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ దాలి నాయుడు, అసోసియేట్ డీన్ ఎ.కృష్ణనాగ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్లపై కేసు నమోదు

నక్కపల్లి : యలమంచిలి నుంచి తునికి అక్రమంగా తరలిపోతున్న పశువుల వ్యాన్లను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టోల్‌గేటు వద్ద శనివారం తనిఖీల్లో భాగంగా రెండు వ్యాన్‌లలో 22 పశువులను తరలిస్తుండగా వ్యాన్లను అడ్డుకుని కేసు నమోదు చేసి, పశువులను తిరిగి సింహాచలం గోశాలకి తరలించినట్టు పోలీసులు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కశింకోట: బ్రహ్మాస్త్రం కషాయం పంటలపై వినియోగించడం ద్వారా పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం విభాగం మండల ఇన్‌చార్జి డి.రమణ తెలిపారు. మండలంలోని సుందరయ్యపేట, జి.భీమవరం గ్రామాల్లో స్వయం సహాయ సంఘాల సభ్య రైతులు, సాధారణ రైతులతో శనివారం బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రకాల ఆకులతో ఈ కషాయాన్ని తయారు చేయాలన్నారు. ఇందుకు తక్కువ ఖర్చు అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు సహజసిద్ధంగా తయారు చేసిన ఈ కషాయాన్ని వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించవచ్చునన్నారు. సిబ్బంది లక్ష్మి, తదితరులు హాజరయ్యారు.

ఐద్వా బస్సు యాత్రను విజయవంతం చేయాలి



బస్సు యాత్ర పోస్టర్ ప్రదర్శిస్తున్న ఐద్వా జిల్లా కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి రూరల్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్న డిమాండ్‌తో ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న బస్సుయాత్ర ఈ నెల 31న అనకాపల్లి పట్టణానికి చేరుకుంటుందని ఇక్కడ జరిగే సమావేశానికి మహిళలంతా పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆమె కోరారు.ఈ మేరకు పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో పోరు యాత్ర బస్సు యాత్ర పోస్టర్‌ను ఐద్వా జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆర్ లక్ష్మి,సభ్యులు గుడాల లావణ్య,ఏ మణి,పార్వతి పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌ను అభినందించిన ఎమ్మెల్యే



కోలా గురువులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : డీసీసీబీ చైర్మన్ కోలా గురువులను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అభినందించారు. డీసీసీబీ చైర్మన్‌గా కోలా గురువులను పార్టీ అధిష్టానం నియమించినందుకు శనివారం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాయకరావుపేట, నక్కపల్లి మండలాల నుంచి పలువురు నాయకులు కోలా గురువులను అభినందించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో పాటు నక్కపల్లి మండలం పార్టీ అధ్యక్షుడు సీరం నర్సింహమూర్తి, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పార్టీ నాయకులు మతా గురునాథరావు, సురకాసుల గోవిందు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై మండల సభ్యుల ఆగ్రహం



మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శిరీష తదితరులు

రాంబిల్లి : మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ జి. శిరీష అధ్యక్షతన జరిగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశం వాడీవేడిగా జరిగింది. పలువురు అధికారుల తీరుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో పలు ప్రభుత్వ భవనాలు నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయని, పక్క మండలాల్లో ఇప్పటికే సచివాలయాల కార్యాలయాల భవనాలు ప్రారంభమైనా రాంబిల్లి మండలంలో ఒక్క సచివాలయం భవనం కూడా ప్రారంభం కాలేదని వాడనర్సాపురం సర్పంచ్ కారె రామారావు అన్నారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లింపులు సక్రమంగా చేయడం లేదని గోకివాడ ఎంపీటీసీ సభ్యుడు అల్లవరపు నాగేశ్వరరావు(బాబ్జి) తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులకు తెలియపరచడం లేదని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. మామిడివాడ రెవెన్యూలో ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని మామిడివాడ సర్పంచ్ అప్పలనర్స ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మండల సర్వసభ్య సమావేశంలో సూపర్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హల్‌చల్ చేశారు. భార్యలు పదవుల్లో భర్తలు చెలామణి అయ్యారు. దీంతో సర్వత్రా విమర్శలు వినిపించాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగరాజు, వైస్ ఎంపీపీలు కొటాపు లక్ష్మి, నర్సింగరావు, తహసీల్దార్ భాగ్యవతి, ఎంపీడీవో కొండలరావు పాల్గొన్నారు.

బైక్ రైడింగ్‌లో జాగ్రత్తలు అవసరం



అడ్డురోడ్డులో బైక్ రైడర్స్‌కి స్వాగతం పలుకుతున్న సీఐ అప్పన్న

ఎస్.రాయవరం : బైకు నడిపేవారు, యువత విధిగా జాగ్రత్తలు పాటించాలని నక్కపల్లి సీఐ అప్పన్న అన్నారు. బైకు రైడింగ్‌పై అవగాహన కల్పించేందుకు కాకినాడకు చెందిన యువకులు కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు ర్యాలీ చేపట్టారు. వారికి సీఐ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ యువత అవగాహన లేకుండా, హెల్మెట్లు లేకుండా బైకులు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. బైకు రైడింగ్‌పై అవగాహన కల్పించేందుకు కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు రైడింగ్‌లో పాల్గొన్న, హవాక్ రైడర్స్ క్లబ్ యువకులను సీఐ అభినందించారు. మరింత మంది యువకులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ రైడింగ్ టీవీఎస్ వారి సహకారంతో చేపట్టినట్టు యువకులు చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాస్ , భరత్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపాలి



అడ్డురోడ్డులో మానవహారం నిర్వహించిన సీఐటీయూ సభ్యులు



రాంబిల్లిలో క్రైస్తవుల ర్యాలీ

ఎస్.రాయవరం : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింస, అకృత్యాలను ఆపాలని, అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అడ్డురోడ్డులో శనివారం ర్యాలీ నిర్వహించారు. దేశంలో అరాచకాలను కట్టడి చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీఐటీయు నాయకులు ఎం.సత్యనారాయణ విమర్శించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

రాంబిల్లి : మణిపూర్‌లో గిరిజన తెగలు, క్రైస్తవులపై దాడులు ఆపాలని, దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని క్రైస్తవ మత బోధకులు డిమాండ్ చేశారు. రాంబిల్లిలో శనివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో దాడులను కేంద్ర ప్రభుత్వం నియంత్రించాలని రాంబిల్లి మండల పాస్టర్ల ఫెలోషిప్ సభ్యులు అన్నారు. అనంతరం ఎస్ఐ దీనబంధు, తహసీల్దార్ భాగ్యవతిలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ల ఫెలోషిప్ నాయకులు జేమ్స్, జాషువారాయ్ , కాలేబు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లూసిన్ ఫార్మా ప్రతినిధి వెంకట్

అనకాపల్లి రూరల్: మహిళలు సామాజిక,ఆర్థిక,రాజకీయ రంగాల్లో రాణించాలని లూసిన్ ఫార్మా డైరెక్టర్ వెంకట్ అన్నారు. తుమ్మపాల ది షేర్ మార్క్స్ పరస్పర సహకార సంఘం సర్వసభ్యసమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సంఘం బలోపేతానికి సభ్య మహిళలు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.ముఖ్యంగా చిరు ధాన్యాల పంటల సాగు కోసం సంఘంలోని మహిళలు కృషి చేయడం మంచి పరిణామన్నారు. సంఘం ద్వారా అందజేస్తున్న రుణాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్యవర్గ సభ్యులు కోరారు. సంఘం వార్షిక నివేదికను పాలకవర్గ అధ్యక్షుడు చదివి వినిపించారు.అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో కర్రి జోగినాయుడు, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్,అనకాపల్లి,కశింకోట మండలాలకు చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

వలంటీరు ఇంట్లో చోరీ

- 6 తులాల బంగారం, 5 తులాల వెండి వస్తువుల అపహరణ

యలమంచిలి: పట్టణంలోని పాత ఎస్‌బీఐ కాలనీలో వలంటీరు శ్యామకుమారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం చోరీ చేశారు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు వివరాల ప్రకారం... ఆమె తన కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి వెళ్లింది. ఇదే అదనుగా చేసుకుని ఆమె ఇంట్లో బీరువాలో ఆరు తులాల బంగారం, ఐదు తులాల వెండి వస్తువులను ఎత్తుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి పట్టణ ఎస్ఐ క్లూస్‌టీంతో వెళ్లి ఇంట్లోను, పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.